క్లుప్తంగా

నేడు వీరభద్రుడి కల్యాణం

ఏటూరునాగారం : ఈనెల 14న (శనివారం) మండల కేంద్రంలోని శ్రీ అభినవ వీరభద్ర స్వామి ఆలయంలో వీరభ్రదస్వామి, శ్రీభద్ర క్రాళీ అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు బల్ల భద్రయ్య తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఆలయంలో శుక్రవారం పచ్చటి పందిరి వేశారు. పాలపారక అలంకరించారు. సాయంత్రం వినాయకుడి పూజ, రాత్రి ఎదురు కోల్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు భద్రయ్య మాట్లాడారు. శనివారం ఉదయం 6 గంటలకు అభిషేకాలు, అర్చనలు, 11.30లకు మహానివేదన, మత్రపుష్పం, మధ్యాహ్నం 1.32 గంటలకు శ్రీఅభినవ వీరభద్రస్వామి శ్రీభద్రకాళి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్రం 6.30లకు కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పన ఉంటాయని చెప్పారు. 15న స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రత్నాకర్, నాగేశ్వర్‌రావు, ఆనంద్, సాంబయ్య, ప్రవీణ్, ప్రసాద్, కిరణ్, రంజిత్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ములుగు : మండలంలోని అన్నంపల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ పెద్దలు శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు నాలుగు టీములు తలపడ్డాయి. విజేతలకు సంక్రాంతి పండుగ నాడు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోరిక రమేశ్, గోపి, దేవేందర్, యువజన సంఘం సభ్యులు పాడె చంటి, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

'ఏఎన్‌ఎంలపై చర్య తీసుకోవాలి'

వెంకటాపురం (ఎం) : మండలానికి చెందిన ఏఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధికార ప్రతినిధి మెట్టు సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. మండలంలోని తొర్రి చింతల పాడు గొత్తికోయగూడెంకు చెందిన సోమక్క ప్రసవ వేదన పడుతుండగా ఆమెను సబ్ సెంటర్‌కు తీసుకురావాలంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏఎన్‌ఎంలపై ఆరోపణలు చేశారు. ఏఎన్‌ఎంలు సమయపాలన పాటించడం లేదని, ఇష్టారీతిన విధులు నిర్వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఏఎన్‌ఎంల నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థికసాయం



ములుగు రూరల్ (గోవిందరావుపేట) : గోవిందరావుపేట మండలంలోని రాంనగర్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు జన్ను రాందాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు శుక్రవారం పరామర్శించి క్వింటా బియ్యంతోపాటు రూ.8,500 సాయం అందించారు. ఈ కార్యక్రమంలో లకావత్ నర్సింహ, సూడి లక్ష్మారెడ్డి, పృథ్వీరాజ్, మోహన్‌రాథోడ్, వాణి రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పనిచేయిస్తే చర్యలు



మాట్లాడుతున్న సునీల్

మల్హర్: పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ సునీల్ అన్నారు. మండలంలోని వల్లెకుంట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన స్వప్న, సాయి, అర్జయ్య కుటుంబంలోని పిల్లలకు న్యూట్రిషియన్ ఆహారానికి సంబంధించిన సరుకులను సునీల్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలను పనికి పంపించద్దని, ప్రతీ రోజు పాఠశాలకు వెళ్లేలా చూడాలని వెల్లడించారు. పనులకు పంపిన వారిని, పని చేయించిన వారిన బాలకార్మికుల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను ఇబ్బంది పెడితే 1098కు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, చైల్డ్‌లైన్ మెంబర్ సుప్రియ పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



కల్యాణమహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవరావు తోపాటు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు మహిళలు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు.

పనిచేయని సెంట్రల్ లైటింగ్



వెలగని సెంట్రల్ లైటింగ్

కాటారం: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో గత కొన్ని రోజులుగా అంధకారం నెలకొంది. మహదేవపూర్ వైపు నుంచి భూపాలపల్లి వైపుగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పని చేయడం లేదు. జాతీయ రహదారిపై లైటింగ్ లేకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేవారు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలి చీకటిమయంతో నెలకొన్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. నిర్వహణ జాప్యంతోనే సెంట్రల్ లైటింగ్ సిస్టం సక్రమంగా పని చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన కూడలిలో వెలుగులు నెలకొనేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'కంటి వెలుగు'తో పేదలకు లబ్ధి



ఏటూరునాగారం : మాట్లాడుతున్న వలీయాబీ



చెల్పాకలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఏటూరునాగారం : ఈనెల 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'కంటి వెలుగు' కార్యక్రమంతో పేదలకు లబ్ధి చేకూరనుందని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ, సర్పంచ్ రామ్మూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడానికి శిబిరాలను ఏర్పాటు చేయనుందని చెప్పారు. ప్రజలు అంధత్వం, ఇతర నేత్ర సంబంధిత సమస్యలపై అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరం ఉన్న ప్రజలు ఆధార్, రేషన్ కార్డులతోపాటు ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకొస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందుల తోపాటు అవసరమైతే కళ్లద్దాలు అందిస్తారని తెలిపారు. నిష్ణాతులైన వైద్య నిపుణులు కంప్యూటరైజ్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుడ్ల శ్రీలత పాల్గొన్నారు.

చెల్పాకలో..

మండలంలోని చెల్పాక గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ సుమతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ మంకిడి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని మారుమూల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని చెప్పారు. శస్త్రచికిత్స అవసరమైతే రెఫర్ చేస్తారని తెలిపారు. తొలుత కంటి వెలుగు కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. వైద్యురాలు సుమలత, సీహెచ్‌ఓ శారద, పంచాయతీ కార్యదర్శి సందీప్ ఉన్నారు.

కమిటీ ఎన్నిక



ఎన్నికైన బూత్‌కమిటీ సభ్యులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు తెలిపారు. 85వ బూత్ అధ్యక్షుడిగా జూన్నాల వివేక్, ఉపాధ్యక్షులుగా కుసుంబ లక్ష్మణ్, మెరుగు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా నల్లబెల్లి రాజు, కార్యదర్శిలుగా రాధాకృష్ణ, గుర జాల శివాజీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే సభ్యులుగా నాగరాజు, కర్నాజి, అనిల్, రామకృష్ణ, శంకరాచారి, శ్రీనివాస్, చందు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కొడ గాని రాజులను నియమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రావుల రాకేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాయిని శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు గోవర్ధన్, తోట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటంచ ఆలయంలో అన్నదానం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నేడు(శనివారం) మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డి, బిల్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నందీశ్వరీ సీడ్స్, ఎస్ఆర్ కంపెనీ వారు సంయుక్తంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పోశాల భద్రయ్య ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. దీంతో బాధిత కుటుంబాన్ని స్థానిక గౌడ సంఘం పెద్దలు మామిండ్లసాయిలు, ఏరుకొండ తిరుపతి, సహదేవ్ గురువారం పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న శైలజ

చిట్యాల: పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని మండల ప్రత్యేక అధికారి శైలజ అన్నారు. మండలంలోని జూకల్‌లో మూడో, ఐదో అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి శైలజ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిజిస్టర్లు పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు రాసి పెట్టాలని మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలు కేంద్రంలోనే భోజనం చేయాలన్నారు. ఆరోగ్యవంతవంతమైన సమాజం ఏర్పాటులో అంగన్‌వాడీ టీచర్లు కీలకంగా వ్యవహరించాలని కోరారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కరుణ, రజిత, సరిత, అరుణతో పాటు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



భూపాలపల్లి రూరల్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ దివాకర



భూపాలపల్లి అర్బన్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎం, కార్యాలయ అధికారులు, సిబ్బంది

భూపాలపల్లి రూరల్: జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇల్లందు భవన్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ దివాకరలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు సంఘాల నిర్వహణతో పాటు ఉద్యోగాల బాధ్యతలను, విధులను అంకితభావంతో సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సామ్యూల్, డీఎంహెచ్‌ఓ శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య, రాజయ్య, స్వామి, భద్రయ్య, ప్రభాకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సంస్థ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సంస్థ ఏళ్ల వేళల కృషి చేస్తుందని జీఎం తెలిపారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటుజీఎం వెంకటయ్య, అధికారులు రామలింగం, జ్యోతి, తుకారాం, శివకేశరావు, శ్రీనివాస్, సందీప్, శ్యాంప్రసాద్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

వాజేడు : యువత సన్మార్గంలో పయనించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని ఇప్పగూడెం, గుమ్మడిదొడ్డి, సుందరయ్య కాలనీకి చెందిన యువతకు గుమ్మడిదొడ్డిలో సర్పంచ్ పాయం జయలక్ష్మితో కలిసి ఆయన శుక్రవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడారు. యువతను దేశానికి వెన్నుముకగా అభివర్ణించారు. యువత సన్మార్గంలో పయనించాలని కోరారు. క్రీడల పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని సొంతూరి, తల్లిదండ్రుల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని కాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు జానకిరమణ, లక్ష్మీనారాయణ, ఏసుబాబు, శ్రీనివాస్, సంతోశ్, గణపతి, ప్రకాశ్, సాంబశివరావు పాల్గొన్నారు.

'వేదామృతం' పై వ్యాఖ్యలు అవివేకం

ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నీరా కల్లుకు పెట్టిన వేదామృతం పేరు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలని బ్రాహ్మణ సంఘాలు వ్యాఖ్యలు చేయడం అవివేకమని కల్లు, గీత కార్మిక సంఘం నాయకుడు రవిగౌడ్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అబ్బాపురంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడారు. కల్లును ప్రకృతి పానీయంగా చెప్పారు. నీరా కల్లుకు వేదామృతం అని పేరు పెడితే బ్రాహ్మణులకు కించపర్చడం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రాచీన కాలంలో వేదాలను తాటి కమ్మలపై రాశారని గుర్తు చేశారు. వైన్ షాపులకు దేవతల పేర్లు పెడుతున్నప్పుడు బ్రాహ్మణ సంఘాలు ఎటుపోయాయని మండిపడ్డారు. సంతోశ్, శ్రీహరి, జనార్దన్, శివశంకర్, ప్రకాశ్, మధూకర్, కిషన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పూరిగుడిసె దగ్ధం



టేకుమట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చందర్ పూరి గుడిసెలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గుడిసె పూర్తిగా దగ్ధం అయినట్లు తెలిపారు. కాగా, ఇంట్లోని టీవీ, బియ్యం, ఇతర సామగ్రి కాలిపోయినట్లు తెలిపారు . సూమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తహసీల్దార్ రామారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద రూ.5,000 నగదుతో పాటు బియ్యాన్ని అందజేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

బాలిక అదృశ్యం

భూపాలపల్లి రూరల్: బాలిక అదృశ్యమైన సంఘటన మండలంలోని దూదేకులపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్, బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక(17) ఈ నెల 11న ఉదయం 10 గంటల సమయంలో పొలం పనులకు వెళ్లి సాయంత్రం అయిన ఇంటికి రాలేదు. దీంతో పొలం వద్దకు వెళ్లి చూసిన కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతిన ఆచూకీ లభించకపోవడంతో బాలిక కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ముగ్గురిపై కేసు నమోదు



మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట ప్రధాన రహదారి వద్ద ఎస్సై రమేశ్ శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కాగా, ముగ్గురు వ్యక్తులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో పట్టుబడగా వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడికి గాయాలు

మహదేవపూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మాడెం ప్రవీణ్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. కాగా, మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు పంపించారు.

ప్రధానోపాధ్యాయుడి మృతి

మహాముత్తారం: అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రేమ్‌నగర్‌లో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోత్ వెంకట్రాం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం కుటుంబసభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వెంకట్రాం మృతిపై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మంగపేట: మండల కేంద్రానికి చెందిన సత్తయ్య (78) తన ఇంట్లోని దూలానికి గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తాహెర్ బాబా తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సత్తయ్య భార్య రెండేళ్ల క్రితం చనిపోగా ఆయన ఒంటరిగా ఉంటున్నాడు. మృతుడి కుమారుడు గోపి సాయంత్రం భోజనం తీసుకురాగా సత్తయ్య ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. కాగా శుక్రవారం గోపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఐలాపూర్ 'సమ్మక్క-సారక్క'పై వివక్ష

● ములుగు ఎమ్మెల్యే సీతక్క



కన్నాయిగూడెం: మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే



ములుగు : చెక్కులు పంపిణీ చేస్తున్న సీతక్క

కన్నాయిగూడెం : ఏజెన్సీ ప్రాంతమైన కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లో జరిగే సమ్మక్క సారక్క జాతర పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష పాటిస్తోందని ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క విమర్శించారు. మండలంలోని ఐలాపూర్ వనదేవతల గద్దెలను శుక్రవారం ఆమె దర్శించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనేక ఏండ్లుగా జాతర జరుగుతున్నా భక్తుల కోసం తాగునీటి, ఇతర వసతులు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. ఆలయానికి ప్రహరీ నిర్మించాలని, గ్రామం నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు వేయాలని, ఇతర వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు ఐలాపూర్‌లో సమ్మక్క సారక్క జాతర జరగనున్న క్రమంలో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలోని పేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు.

నిధులు మంజూరు చేయించాలని వినతి

ఐలాపూర్ సమ్మక్క సారక్క జాతర నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయించాలని కోరుతూ పూజారుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూజారులు సమస్యలను సీతక్కకు వివరించారు. మండలంలోని సర్వాయి గ్రామం నుంచి ఐలాపూర్‌కు సారక్కను అడవి మార్గాన తీసుకొస్తారని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు, ఆలయ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అఫ్సర్ పాషా, సీనియర్ నాయకులు జాడి రాంబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సునార్కని రాంబాబు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బు రమేశ్, చిట్యాల అరుణ్, సుమన్, కాంగ్రెస్ పార్టీ ఐలాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పీరీల భాస్కర్, సురేశ్, నగేశ్, గుడ్ల దేవేందర్ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతలు సమ్మక్క–సారలమ్మ

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క–సారలమ్మలను స్ఫూర్తిప్రదాతలుగా ఎమ్మెల్యే సీతక్క అభివర్ణించారు. తాడ్వాయి సర్పంచ్ సునీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు లచ్చు పటేల్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేడారం వనదేవతల గద్దెల వద్ద సీతక్క ఆవిష్కరించారు. తొలుత కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వనదేవతల సందర్శనకు రాగా వారితో సీతక్క మాట్లాడారు. సమ్మక్క-సారలమ్మ ప్రజల కోసం ప్రాణాలర్పించి దేవతలుగా నిలిచారని చెప్పారు. సమ్మక్క–సారలమ్మ పోరాటాన్ని అధ్యయనం చేయాలని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ములుగు : వెంకటాపురం మండలానికి చెందిన నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సీతక్క పంపిణీ చేసి మాట్లాడారు. శ్రేణులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవంత్‌యాదవ్, సర్పంచ్ అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్ (గోవిందరావుపేట) : గోవిందరావుపేట మండలానికి చెందిన అజ్మీర శారద, నేరేళ్ల రూప, పొలదుగు సామ్రాజ్యం, సంపత్‌రెడ్డిలకు ఆ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను సీతక్క పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీతారాం నాయక్, దాసరి సుధాకర్, శ్రీకాంత్, ప్రభాకర్, సారయ్య, నాగేందర్‌రావు ఉన్నారు.

పేదలను ఆదుకునేందుకే 'కల్యాణలక్ష్మి'



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం : పేదలను ఆదుకునేందుకే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ అంతటి విజయ, సర్పంచ్ రామ్మూర్తి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయా బీ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఏడుగురు లబ్ధిదారులకు శుక్రవారం వారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ, ఆర్ఐలు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.